# పరివర్తన

-బి.వి. శివప్రసాద్

"నా సైను కన్పించడం లేదండి"

ఫార్మ్‌లో రౌండ్స్‌లో ఉన్న రఘురాం చెవిలో ఈ మాటలు ఖంగుమన్నాయి. వెనక్కి తిరిగి చూస్తే తన దగ్గర పనిచేస్తున్న రామరాజు ఖిన్నవదనంతో నిల్చుని ఉన్నాడు. పరిగెట్టుకు రావడం వల్ల ఆయాసంతో వగరుస్తున్నాడు.

"ఏమయ్యింది?" ప్రశ్నించాడు రఘురాం.

"దుబాయ్ నుంచి మా అమ్మ పంపిన బంగారు సైను (చైను) కన్పించడంలేదండి" చెప్పాడు రామరాజు.

"ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్' (రొయ్యల చెరువులు, చేపల చెరువులు, కూరగాయలు పండించడం, వర్మీ కంపోస్ట్ ఇవన్నీ ఒక్కచోటే చెయ్యడం) చేస్తున్న తన దగ్గర పదిమందికి పైగా బాయ్స్, వంటమనిషి, ముగ్గురమ్మాయిలు కూడా పనిచేస్తున్నారు. దాదాపు పది సంవత్సరాలుగా తాను ఫార్మ్ రన్ చేస్తున్నాడు. ఇన్నాళ్లలో ఎప్పుడూ దొంగతనం గానీ, ఏదయినా వస్తువు కన్పించకపోవడమంటూ జరగలేదు. తన ఆఫీసు రూమ్‌లో కూడా ఏవయినా విలువయిన వస్తువులు అందరికీ కన్పించేలా ఉన్నా ఇప్పటివరకూ ఏ కంప్లయింట్ లేదు. అలాంటిది ఇప్పుడు తను విన్నది షాకింగ్‌గా ఉంది. ఆ క్షణంలో వివిధ రకాలయిన ఆలోచనలు అతని మనస్సులో కలిగాయి. తమాయించుకోవడానికి కొంత టైమ్ పట్టింది.

పోయిన వస్తువు విలువ 15 వేల రూపాయలు పైనే ఉంటుంది. ఇది రామరాజుకి తగిలిన ఓ పెద్ద దెబ్బ. మళ్లీ అంత విలువయిన వస్తువు వాడు సమకూర్చుకోవడం అంత తేలిక కాదు. పోనీ తాను మళ్లీ ఓ కొత్త చైను కొని వాడికిద్దామన్నా, అది సరైన పరిష్కారం కాదు. ఈ సంఘటనని చూసీచూడనట్టు వదిలేస్తే, మళ్లీ ఇలాంటివి ముమ్ముందు జరగడానికి ఆస్కారం ఉంది. అది మంచిది కాదు. అలా జరిగితే సంస్థకున్న మంచి పేరు గోదాట్లో కలిసి పోతుంది. కాబట్టి ఈ సమస్యను ఎలా పరిష్కరించాలా అని తీవ్రంగా ఆలోచించడం మొదలెట్టాడు రఘురాం.

అనుమానం ఉన్న వాళ్లని ప్రశ్నించడం ఓ పద్ధతి. ఈ తలనొప్పి వద్దనుకుంటే, పోలీసు కంప్లయింట్ ఇస్తే! కానీ ఇంతవరకూ తన ఆవరణలోకి పోలీసులు అడుగు పెట్టలేదు. అసలే ఇది చిన్న ఊరు. పరువు గంగ పాలవుతుంది. అందుకని సమస్యను తానే పరిష్కరించడానికి పూనుకున్నాడు రఘురాం. అసలు ఈ దొంగ

## బ్రతికి చూపాల్సిందే

కీకారణ్యాలలో ఉండే
మృగాల కన్నా
కాంక్రీటు అరణ్యాలలో ఉండే
మనుషులంటేనే భయం
మృగాలు ఆకలిగొన్నప్పుడే
వేటాడతాయి
ప్రమాదం పసికట్టినప్పుడే
దాడి చేస్తాయి
వాటికి దూరంగా ఉంటే చాలు
మనం బతికి బట్టకట్టినట్టే

కాంక్రీటు అరణ్యాలలో
మమతానుబంధాలు మరిచిన
మనుషులుంటారు
వెన్నుపోటు పొడిచే
మేకవన్నె పులులుంటారు
పేదోళ్ల కడుపులు కొట్టే
కిరాతకులుంటారు
దేశాన్ని దోచుకుతినే
రాబందులుంటారు

ఇలా మానవత్వం కోల్పోయిన
ఎందరెందరో మనుషుల మధ్య
మెలగడం మహా కష్టం
అయినా తప్పదు మరి
పద్మవ్యూహాన్ని ఛేల్చుకుంటూ
ముందుకురికిన అభిమన్యుడిలా
సాగిపోవాల్సిందే!
బతికి చూపాల్సిందే!

-జి. నీలకంఠం

తనానికి ఎవరు పాల్పడి ఉంటారు. తనకున్న సమస్య లకు తోడు మరో తలనొప్పి.

సాయంత్రం అవుతోంది. తను ఇంటికి బయలు దేరాలి. వెళ్లేలోగా ఎంతో కొంత ఇన్ఫర్మేషన్ రాబట్టాలి. ఆ రోజుకి చేయగలిగిన రెండు పద్ధతులు కనిపించాయి. అందులో ఒకటి రామరాజు ఇచ్చిన సలహా. అదేమిటంటే, ఆ గ్రామంలో ఒకావిడని దేవుడావహిస్తాడని ప్రతీతి. అది రోజులో ఒక్కసారే జరుగుతుంది. సూర్యాస్తమయం తర్వాత. ఆ టైమ్‌లో ఆవిడ ముందు మన సమస్య ఉంచితే, పరిష్కారం లభించొచ్చు. ఇది ఆ ఊరివాళ్ల ప్రగాఢ విశ్వాసం.

ఇక రెండో పద్ధతి- స్టాఫ్‌లో భయాందోళనలు కల్గించి దోషిని పట్టుకోవడం. ఈ రెండు పద్ధతులూ ప్రయత్నించడంలో తప్పులేదనిపించింది అతనికి. వెంటనే పనివాళ్లందర్నీ పిలిపించాడు.

"ఇన్నిరోజులూ మనమంతా ఓ కుటుంబంలా కలిసి ఉంటున్నాం. నేనెప్పుడూ మిమ్మల్ని కేవలం పనివాళ్ళుగా చూడలేదు. తప్పు చేసింది ఎవరయినా సరే, 24 గంటలలోపు పోయిన వస్తువు అదే స్థానంలో ఉంచెయ్యండి. లేదంటే రేపు పోలీసు కంప్లయింట్ ఇస్తాను" అన్నాడు రఘురామ్. తరువాత ఇంటికెళ్లిపోయాడు.

ఆ తరువాత అసలు డ్రామా మొదలైంది. రామరాజు సాయంత్రం ఆరున్నరకు తన సహచరులను వెంటబెట్టుకుని దేవుడు ఆవహిస్తున్న మహిళ దగ్గరకు వెళ్లాడు. ఆమె విషయమంతా చెప్పాడు. ఆమె కొద్దిసేపు కళ్లు మూసుకుని, ఓ ఐదు నిమిషాల ధ్యానంలో మునిగిపోయింది. తరువాత నెమ్మదిగా కళ్లు తెరిచి అందరి ముఖాన బొట్లు పెట్టి చెప్పింది.

"దొంగ మీలోనే ఒకడు. వాడికి సహకరించింది ఇద్దరు. రేపటికల్లా మీ వస్తువు మీకు దొరుకుతుంది. దొంగతనం చేసినవాడి కాళ్లూ, చేతులు చచ్చుబడిపోతాయి. జ్వరం వచ్చినట్లవుతుంది. రేపు వస్తే దొంగ ఎవరో చెబుతాను" అంది.

ఈ తంతు జరుగుతున్నంతసేపూ రామరాజు ఓరకంటతో తన సహచరులను గమనిస్తూనే ఉన్నాడు. ఒకరిద్దరు వణుకుతున్నారు. మరొకడు తత్తరపడుతున్నాడు. కానీ ఎవరు అసలు దొంగో అంతుబట్టడం లేదు.

తిరిగి వస్తూ, "ఇలా చేసినోడు బాగుపడ్డు. దేవత వాణ్ణి వదిలిపెట్టదు" అనుకున్నారు వారిలో వారు.

రఘురాం మరుసటి రోజు ఫామ్‌కు వచ్చేసరికి మరో విచిత్రం జరిగింది. అతని దగ్గరకు రామరాజు పరిగెట్టుకుంటూ వచ్చి,

"సైను దొరికేసిందండి!" అన్నాడు వగరుస్తూ.

రఘురాం మళ్లీ షాక్ తిన్నాడు. ఎందుకంటే తన ఫామ్‌లో దొంగతనం జరగడం అనేది ఊహకందని విషయం. అలాంటిది పోయిన వస్తువు మళ్లీ దొరకడం. అసలు దొంగెవరో తేల్చవలసిందే అనే నిర్ణయానికి వచ్చాడు. అనుమానితులు ఒక్కొకర్నీ పిలిచి విచారించాడు. బాగా అనుమానం వచ్చిన వారిని దండించాడు.

అది చూసి చలించిపోయిన రామరాజు రఘురాం దగ్గరకు వచ్చి "నేను మీతో మాట్లాడాలి. వారిని పంపించి వేయండి" అని కోరాడు.

వారిని పంపించివేసి ఏమిటన్నట్టు కళ్లెగరేశాడు రఘురాం.

"నన్ను క్షమించండి. నిజానికి నా సైను పోలేదండి. నేనే దాన్ని దాచి, పోయినట్టుగా చెప్పాను. ఇదంతా ఎందుకు చేశానంటే, మన ఫామ్‌లోని వారంతా నన్ను చిన్నచూపు చూస్తున్నారండీ. ఎవరూ నన్ను పెద్దగా పట్టించుకోరు. నాతో మాట్లాడరు. ఏదో ఒకటి చేస్తే అందరూ నన్ను గుర్తిస్తారని... ఇలా చేశానండీ. నన్ను మన్నించండి" అన్నాడు రామరాజు.

దీంతో కొండంత భారం దిగినట్టు ఫీలయ్యాడు రఘురాం. తన పనివారెవరూ చెడ్డవారు కాదు. ఆ నమ్మకం తనకుంది. అయితే ఇలాంటి సంఘటన జరగడం అవమానంగా భావించి తానే అనుచితంగా ప్రవర్తించాడు. అనవసరంగా కొందరి మనసులు బాధపెట్టానని మనసులో పశ్చాత్తాపపడ్డాడు.

అసలు దీనికంతా కారణం రామరాజు. నిజానికి లోపం అంతా వాడిదే. బిడియస్తుడు కావడంతో వాడితో ఎవరూ మాటలు కలపలేకపోయారు. దాంతో అంతా వాణ్ణి నిర్లక్ష్యం చేస్తున్నట్టు భావించాడు. అందుకే ఈ రాద్ధాంతం అంతా. ఛ! ఇంకా ఇలాంటి వారెవరన్నా ఉన్నారేమో గుర్తించి వారి ప్రవర్తనా సరి చేయాలి. అందరూ కలిసి మెలిసి ఉండేలా చూడాలనుకున్నాడు రఘురాం. ■